బ్లాక్ మార్కెట్‌కు పేదల బియ్యం

- ముస్తాబాద్ కేంద్రంగా రాకెట్
- కొరడా ఝుళిపిస్తున్నా ఆగని వైనం
- నేరుగా మిల్లులు, కోళ్లదాణాకు

ముస్తాబాద్: పేదలు తినాల్సిన రేషన్ బియ్యం ముస్తాబాద్ కేంద్రంగా అక్రమ రవాణా అవుతోంది. సులువుగా డబ్బులు సంపాదించేందుకు స్థానికులు కొంతమంది ఈ రేషన్ బియ్యం దందా చేస్తూ కోట్లకు పడగలెత్తుతున్నారు. ఒకవైపు టాస్క్‌ఫోర్స్ పోలీసులు వరుస దాడులతో రేషన్ బియ్యం అక్రమ రవాణాపై అడపాదడపా కొరడా ఝుళిపిస్తున్నా ఈ అక్రమ దందాను నియంత్రించలేకపోతున్నారు. ఈ రెండు, మూడు రోజుల్లోనే 69 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. కాని స్థానికంగా ఈ దందాను నియంత్రించాల్సిన అధికారులు మాత్రం పట్టించుకోకపోవడంతో అక్రమార్కులకు అడ్డుఅదుపు లేకుండా పోతోంది. యథేచ్ఛగా సాగుతున్న ఈ రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ప్రత్యేక కథనం..


నామాపూర్‌లో పట్టుబడ్డ బియ్యం, నిందితులతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు (ఫైల్)

మండలంలో సమాచారం

చౌక ధరల దుకాణాలు : 29
రేషన్‌కార్డుల సంఖ్య: 14,397
లబ్ధిదారుల సంఖ్య: 39,996
రేషన్ కోటా(నెలకు): 266.383 మె.టన్నులు

సన్నరకం బియ్యం.. స్మగ్లర్లకు వరం

రేషన్ బియ్యం లబ్ధిదారులకే చెందాలన్న ప్రభుత్వ లక్ష్యం మేరకు బయోమెట్రిక్ విధానం తీసుకువచ్చారు. రేషన్ దుకాణాల నుంచి నేరుగా లబ్ధిదారులు బియ్యాన్ని పొందుతుండగా 70 శాతం మంది సన్న రకం బియ్యాన్ని మాత్రమే వినియోగిస్తున్నారు. కేవలం పేదలు, అత్యంత పేద ప్రజలు మాత్రమే దొడ్డురకం బియ్యం వాడుతున్నారు. ఇదే స్మగ్లర్లకు వరంగా మారింది. ముస్తాబాద్ మండలంలో నెలకు 266 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సివిల్ సప్లై ద్వారా సరఫరా చేస్తుండగా, ఇందులో 150 మెట్రిక్ టన్నుల బియ్యం అక్రమార్కులు సేకరిస్తున్నట్లు అంచనా వేస్తున్నారు.

పక్కదారి పడుతుందిలా..

రేషన్ దందాపై విస్తుపోయే అంశాలు వెలుగు చూస్తున్నాయి. ఇంటింటికి వెళ్లి కిలో రేషన్ బియ్యం రూ.10 కొనుగోలు చేస్తున్నారు. అలా సేకరించిన బియ్యాన్ని వారు మండల స్థాయిలో ముస్తాబాద్, నామాపూర్, ఆవునూర్, మోహినికుంటల్లో ఉన్న బ్రోకర్లకు కిలో బియ్యం రూ.14 వరకు విక్రయిస్తున్నారని తెలుస్తోంది. వీరు మిల్లర్లు, కోళ్ల దాణా వ్యాపారులకు కిలో బియ్యం రూ.18 వరకు విక్రయిస్తున్నారు. కొన్ని మిల్లుల్లో సీఎంఆర్ కింద రేషన్ బియ్యాన్ని ప్రభుత్వానికి కిలో రూ.40 తీసుకుని సరఫరా చేస్తున్నారు. వారికి కేటాయించిన సీఎంఆర్ ప్రకారం, అక్రమంగా తక్కువ ధరకే వచ్చిన పీడీఎస్ బియ్యాన్ని బ్యాగుల్లోకి మార్చి లేవీకి సప్లై చేస్తున్నారు. ఇదంతా బహిరంగ రహస్యమే అయిన అటు పౌర సరఫరా, రెవెన్యూ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పట్టించుకోరనే విమర్శలు వస్తున్నాయి. కొన్ని రైస్‌మిల్లుల యజమానులు కేవలం పీడీఎస్ కొనుగోలుతోనే బిగ్‌షాట్‌లుగా మారారని చర్చ జరుగుతోంది. సిద్దిపేట, కామారెడ్డి పట్టణాలకు రాత్రివేళల్లో సరఫరా జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

వరుసదాడులతో వణుకు..

టాస్క్‌ఫోర్స్ పోలీసులు వరుసగా ముస్తాబాద్ మండలంలో రేషన్ బియ్యం అక్రమ రవాణాపై దాడులు చేస్తున్నారు. ఈ నెలలో మూడు వాహనాలను పట్టుకొని, 69 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని కొన్ని రైస్‌మిల్లులతోపాటు, కామారెడ్డి, సిద్దిపేట మిల్లులకు పెద్ద ఎత్తున తరలిపోతున్న రేషన్ బియ్యంపై నిఘా పెట్టారు. దీంతో పక్షం రోజులుగా రేషన్ దందాకు విరామం ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే టాస్క్‌ఫోర్స్ దాడులు సర్వసాధారణమేనని, గతంలో కూడా ఇలాగే జరిగాయని తిరిగి పది రోజులు ఆగితే తిరిగి రవాణా చేయవచ్చని బియ్యం సేకరించే వారు అనుకోవడం విశేషం.

సమన్వయ లోపం

గతంలో రేషన్ డీలర్లు అక్రమాలకు పాల్పడితే వారిపై 6ఏ కేసులు నమోదు చేసి, డీలర్‌షిప్‌ను రద్దు చేసేవారు. రేషన్ సరుకులు పక్కదారి పట్టకుండా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్‌లతో రెవెన్యూ శాఖలో ప్రత్యేక విభాగాలు ఉండేవి. అలాగే పోలీసులు సైతం రేషన్ సరుకులు అక్రమ రవాణా చేసే వారిపై పీడీయాక్టులు పెట్టేవారు. రేషన్ బియ్యం కొనుగోలు చేసే మిల్లులను సైతం సీజ్ చేసేవారు. ఇప్పుడా శాఖలు లేవు. డీటీసీఎస్ ఒక్కరే ఉన్నారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఖాళీగా వుంది. తహసీల్దార్, డీటీ, ఆర్ఐల పర్యవేక్షణ నిరంతరం ఉండేది. సివిల్ సప్లై, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతోనే రేషన్ బియ్యం దందాకు అడ్డుకట్ట వేయవచ్చని భావిస్తున్నారు. అలాగే అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కేవలం చీటింగ్ కేసులు, జరిమానాలతో సరిపెట్టడంతో ఈ అక్రమ వ్యాపారాన్ని స్మగ్లర్లు వీడడం లేదని పలు శాఖల అధికారులు అంటున్నారు.

నిఘా పెంచాలి



కేంద్ర ప్రభుత్వం పేదలకు ప్రతినెల అందిస్తున్న బియ్యాన్ని అక్రమమార్గంలో తరలించే వారిపై చర్యలు తీసుకోవాలి. పేదల ఆకలిని తీర్చే బియ్యాన్ని కొంతమంది సీఎంఆర్‌కు పెట్టడం బాధాకరం. నిరంతర నిఘాతోనే దందాకు చెక్ పెట్టాలి. ఈ విషయంలో పకడ్బందీగా చర్యలు చేపట్టాలి.

– కనమేని చక్రధర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు

సన్నరకం అందించాలి



పేద ప్రజల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం అందిస్తున్న బియ్యం కొంతమంది వ్యాపారులు, మిల్లర్లకు వరంగా మారింది. దీనిపై నిఘా కొరవడడంతో రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. నిజమైన అర్హులను గుర్తించి వారికి సన్నరకం బియ్యం అందించాలి. రేషన్ బియ్యం తినని వారి కార్డులను రద్దు చేయాలి.

– చాకలి రమేశ్, సర్పంచ్, గూడూరు

అడ్డుకట్ట వేస్తున్నాం



రేషన్ బియ్యం స్మగ్లింగ్‌పై జిల్లా టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం వస్తోంది. టాస్క్‌ఫోర్స్ టీం పక్కా స్కెచ్‌తో బియ్యాన్ని పట్టుకుంటున్నాం. స్థానికంగా ఉన్న వివిధ శాఖల అధికారులు దీనిపై నిఘా పెడితే మా వరకు ఫిర్యాదులు అందవు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతున్నాం.

– మారుతి, టాస్క్‌ఫోర్స్ ఎస్సై

క్లుప్తంగా

'మహిళల భద్రతకు ప్రాధాన్యం'


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జిందం కళ

సిరిసిల్లటౌన్: మహిళ భద్రతకు, విద్యాభివృద్ధికి రాష్ట్ర సర్కారు అధిక ప్రాధాన్యత ఇస్తుందని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. సక్సెస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ బ్యూటీ సొల్యూషన్స్ వారి ఆధ్వర్యంలో ఈనెల 23న నిర్వహించే అవగాహన కార్యక్రమం పోస్టర్లను ఆమె మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ సర్కారు మహిళా సాధికారతకు మొదటి నుంచి పెద్దపీట వేస్తుందన్నారు. మహిళలు బ్యూటిషియన్ రంగంలో రాణిస్తూ ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఇనిస్టిట్యూట్ ఆర్గనైజర్ స్వప్నరావు పాల్గొన్నారు.

రుణమాఫీ అయ్యేలా చూడాలి

- ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి వినతి


రాజేశ్వర్‌రెడ్డిని కలిసిన రైతుబంధు సమితి అధ్యక్షుడు గడ్డం నర్సయ్య

సిరిసిల్లఅర్బన్: రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని రాజన్న సిరిసిల్ల జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు గడ్డం నర్సయ్యతో పాటు పెద్దూరు పీఏసీఎస్ పాలకవర్గం సభ్యులు మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పెద్దూరు వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని రైతు రుణమాఫీ కానీ రైతులకు రుణామాఫీ అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పెద్దూరు పీఏసీఎస్ చైర్మన్ జీల కిషన్, డైరెక్టర్ వెంకటరమణరావు, సభ్యులు ఆదిపెలి నారాయణ, సలేంద్రి వేణు, సీఈవో గౌరీశంకర్ పాల్గొన్నారు.

సమ్మె విరమించాలి

- శిబిరంలో కార్మికులతో ఎంపీడీవో చర్చలు


కార్మికులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

తంగళ్లపల్లి: గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె విరమించి విధుల్లో చేరాలని ఎంపీడీవో పి.లచ్చాలు మంగళవారం సమ్మె చేస్తున్న దీక్షా శిబిరానికి వెళ్లి కార్మికులను కోరారు. బుధవారం నుంచి విధుల్లో చేరాలని ఎంపీడీవో కోరగా కార్మికులు తిరస్కరించారు. దీంతో వారి స్థానంలో తాత్కాలిక కార్మికులను నియమిస్తామని వారి పనులకు అడ్డురావొద్దని పంచాయతీ కార్మికులను కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో లచ్చాలుతోపాటు ఇన్‌చార్జి ఎంపీవో విజయేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

సంఘాలు - ఎన్నికలు

బ్రాహ్మణ పురోహిత సంఘం కార్యవర్గం

ఇల్లంతకుంట: బ్రాహ్మణ పురోహిత సంఘం మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెరుకు పవన్ శర్మ, ఉపాధ్యక్షులుగా బదనకంటి సుధాకర్ శర్మ, చెరుకు హన్మంతరావు, ప్రధానకార్యదర్శి కొండకింది రాజేశ్వర్‌శర్మ, కోశాధికారి మూగు నాగరాజుశర్మ, సంయుక్త కార్యదర్శి రామక శ్రీధర్‌శర్మ, కార్యవర్గసభ్యులు విఠల్ శర్మ, ఆనంద్‌శర్మ, సీతారామశర్మ, శశాంక్‌శర్మ ఎన్నికయ్యారు.

మహిళల ఆరోగ్యమే లక్ష్యం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

సిరిసిల్లఅర్బన్: వేములవాడ, సిరిసిల్లలోని సుందరయ్యనగర్, తంగళ్లపల్లి, నేరేళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య శిబిరాలను నిర్వహించారు. మొత్తం 400 మందికి పరీక్షలు చేయగా, వారిలో 398 మందికి బ్రెస్ట్, ఓరల్ క్యాన్సర్, థైరాయిడ్ 28, సీబీపీ 27 మందికి పరీక్షలు నిర్వహించారు. విటమిన్ డీ లోపం 21 మందికి, 42 మందిలో సూక్ష్మపోషకాల లోపం ఉన్నట్లు గుర్తించారు. 39 మందికి పలు రకాల రక్త, మూత్ర పరీక్షలు చేశారు. పలు ఆరోగ్య సమస్యలు ఉన్న ముగ్గురిని జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నులి పురుగులను నిర్మూలిద్దాం


మాట్లాడుతున్న వైద్యాధికారి గీతాంజలి

ముస్తాబాద్: నులి పురుగుల నివారణకు అందరూ కలిసి పనిచేయాలని పోతుగల్ వైద్యాధికారి బత్తుల గీతాంజలి అన్నారు. పీహెచ్‌సీలో నులి పురుగుల నివారణపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మండలంలో ఈనెల 20న ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో 1–19 ఏళ్ల వయసుగల పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలను వేయాలన్నారు. మండలంలో సుమారుగా ఆరు వేల మంది చిన్నారులను గుర్తించామన్నారు. 20న మాత్రలు తీసుకోని వారికి 27న ఇవ్వాలన్నారు. నులిపురుగుల వల్ల కలిగే నష్టాలను తల్లిదండ్రులకు, పిల్లలకు వివరించి, వారు మాత్రలను వేసుకునేలా చూడాలన్నారు. సీహెచ్‌వో యాదగిరి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు తదితరులున్నారు.

ఇంటింటా స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే


సర్వే చేస్తున్న అధికారులు

గంభీరావుపేట: ఇంటింటా స్వచ్ఛ సర్వేక్షణ్–2023 సర్వే ప్రారంభమైంది. మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్నారు. ఇంటిలో వ్యక్తిగత మరుగుదొడ్డి ఉందా లేదా, వినియోగిస్తున్నారా, తడి పొడి చెత్తను వేరు చేసి గ్రామపంచాయతీ చెత్త ట్రాక్టర్‌కు అందిస్తున్నారా లేదా అనే అంశాలను సేకరిస్తున్నారు.

అన్నదాతల ఆర్థికాభివృద్ధికి కృషి


చెక్కులు అందజేస్తున్న కృష్ణారెడ్డి

ఎల్లారెడ్డిపేట: వ్యవసాయ అనుబంధ రంగాలను అభివృద్ధి చేస్తూ పెద్ద ఎత్తున రుణాలను అందజేస్తున్నట్లు సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఏడుగురు రైతులకు దీర్ఘకాలిక రుణాలకు సంబంధించిన రూ.38.50 లక్షల చెక్కులను మంగళవారం ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వెంకట నర్సింహారెడ్డి, ఎల్లయ్య, కార్యదర్శి కిషోర్‌కుమార్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వినూత్న నిరసన


ముస్తాబాద్‌లో చెవిలో పువ్వులతో నిరసన తెలుపుతున్న కార్మికులు

ముస్తాబాద్/తంగళ్లపల్లి: గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె మంగళవారంతో 13వ రోజుకు చేరుకుంది. ముస్తాబాద్‌లో పంచాయతీ కార్మికులు చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు. ప్రభుత్వం ఇకనైన కార్మికుల కష్టాలను తీర్చాలని డిమాండ్ చేశారు. ఒకవైపు వర్షం పడుతున్న లెక్కచేయకుండా నిరసనలు తెలిపారు. ప్రభుత్వం దిగివచ్చే వరకు సమ్మె ఆగబోదన్నారు. దీక్షా శిబిరాలను సందర్శించిన తంగళ్లపల్లిలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ కంచర్ల రవి గౌడ్, టౌన్ అధ్యక్షుడు రుద్రవీణ సుజిత్ కుమార్, ముస్తాబాద్‌లో కాంగ్రెస్, సీఐటీయూ నాయకులు పెద్దిగారి శ్రీనివాస్, వొరగంటి తిరుపతి, తదితరులు సమ్మెకు మద్దతు తెలిపారు.

అటెన్షన్ ప్లీజ్



చినుకు పడితే చిత్తడే..

ఎల్లారెడ్డిపేట: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం అడుగడుగున గుంతలతో అధ్వానంగా మారింది. వర్షం పడితే చిత్తడిగా మారి, ప్రయాణికులు కాలుతీసి కాలువేయడం కష్టంగా ఉంటుంది. దీంతో బస్సులు ఎక్కేందుకు వచ్చే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. బస్టాండ్ ప్రాంగణం పూర్తిగా సీసీ లేకపోవడంతో ఈ పరిస్థితి ఉందని, అధికారులు స్పందించి ప్రాంగణమంతా సీసీగా మార్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: మనోహర్, డిపో మేనేజర్, సిరిసిల్ల
ఫోన్ నంబర్: 99592 25929

మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం


సిరిసిల్లలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు


ఎల్లారెడ్డిపేటలో..

సిరిసిల్లటౌన్/ఎల్లారెడ్డిపేట/కోనరావుపేట/ఇల్లంతకుంట: రాహుల్ గాంధీపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ జిల్లాలోని పలు మండల కేంద్రాల్లో మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు మంగళవారం దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రధాని పదవిని సైతం త్యాగం చేసిన రాహుల్ గాంధీపై మంత్రి కేటీఆర్ సభ్యత, సంస్కారం లేకుండా చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలన్నారు. రాహుల్‌గాంధీని విమర్శించే నైతిక హక్కు ఆయనకు లేదన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని వనిత, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య, షేక్ ఫిరోజ్‌పాషా, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్కే గౌస్, జిల్లా కార్యదర్శులు లింగంగౌడ్, వంగ గిరిధర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఆసుపత్రి నిర్మాణం వద్ద బీజేపీ ధర్నా


ఆందోళన చేస్తున్న నాయకులు

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్ పీహెచ్‌సీలో చేపట్టిన భవనాల నిర్మాణంలో నాణ్యత లోపాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కొల కృష్ణ మాట్లాడుతూ రూ.1.45 కోట్ల భారీ వ్యయంతో నిర్మిస్తున్న ఈ భవనంలో సిమెంట్, స్టీల్ లోపాలు ఉన్నాయని, పిల్లర్లు, బీమ్‌లలో వ్యత్యాసం ఉందని ఆరోపించారు. కాంట్రాక్టర్, ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు కుడుకల జనార్దన్, బీజేపీ నాయకులు మెంగని మహేందర్, మీస శంకర్, ఆది శేఖర్, బండి శ్రీకాంత్, వేణు, మద్దికుంట రమేశ్ పాల్గొన్నారు.

పనులు పరిశీలించిన డీఈఈ

ఆసుపత్రి నిర్మాణంలో నాణ్యత లోపించిందని ఆరోపిస్తూ మూడు రోజుల క్రితం కాంగ్రెస్, తాజాగా బీజేపీ నాయకులు కూడా ధర్నా చేపట్టడంతో పంచాయతీరాజ్ డీఈఈ సుదర్శన్‌రెడ్డి మంగళవారం పనులు జరుగుతున్న తీరు, నాణ్యతను పరిశీలించారు. మరోసారి పంచాయతీరాజ్ ఈఈతో వచ్చి పనులు పరిశీలిస్తామన్నారు. ఆయన వెంట స్పెషల్ ఏఈ ప్రవీణ్ ఉన్నారు.

'ఓట్లు అడిగేహక్కు బీఆర్‌ఎస్‌కే ఉంది'


నియామక పత్రాలు అందిస్తున్న ప్రవీణ్

సిరిసిల్లటౌన్: ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందించిన పార్టీగా బీఆర్ఎస్‌కు మాత్రమే రాబోయే ఎన్నికల్లో ప్రజలను ఓట్లు అడిగే హక్కుందని టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్ అన్నారు. మంగళవారం సిరిసిల్లలోని 23, 24 వార్డుల్లో బూత్ కమిటీల సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్లుగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. బూత్ కమిటీల ప్రతినిధులుగా ఎన్నికైన కార్యకర్తలకు నియామకపత్రాలను అందించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, పార్టీ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ వైస్‌చైర్మన్ శ్రీనివాస్, బొల్లి రామ్మోహన్, దిడ్డి శ్రీనివాస్, మ్యాన రవి పాల్గొన్నారు. ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌లో మంగళవారం బూత్ కమిటీలను జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి ఏర్పాటు చేసి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ నిమ్మ లక్ష్మి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ ఎలుసాని మోహన్‌కుమార్, ఎంపీటీసీ అపెరా సుల్తానా, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులకు సహకరించండి

బోయినపల్లి: మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామ డబుల్ రోడ్డు పరిసరాల్లో నిర్వహిస్తున్న ఫోర్‌లేన్ రోడ్డు విస్తరణ పనులకు ప్రజలు సహకరించాలని ఆర్‌అండ్‌బీ ఏఈ సతీశ్ కోరారు. మంగళవారం గ్రామస్తులతో రోడ్డు విస్తరణ విషయంలో మాట్లాడారు.

రైతుల కోసం ఎన్నో పథకాలు

కోనరావుపేట: రైతుల కోసం ఎన్నో పథకాలు అమలుచేస్తున్న ప్రభుత్వం ఒక్క టీఆర్ఎస్ అని ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్ అన్నారు. మండలం బావుసాయిపేట రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

సంక్షిప్త వార్తలు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండలం నారాయణపూర్‌లో మంగళవారం లబ్ధిదారులకు మంజూరైన రూ.2.37 లక్షల చెక్కులను జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు మంగళవారం పంపిణీ చేశారు.

వీర్నపల్లి: మండలం కంచర్ల గ్రామంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. చాట్ల శంకర్ రూ.24 వేలు, అల్లెపు రాధ రూ.17,500 ప్రజాప్రతినిధులు అందజేశారు.

శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివాసం ఉండొద్దు

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి: శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఎవరూ నివాసం ఉండొద్దని, ప్రస్తుత వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్లు జయంత్‌కుమార్, తఫాజుల్ హుస్సేన్ అన్నారు.

మంత్రి కేటీఆర్‌తో అభివృద్ధి

సిరిసిల్లఅర్బన్: మంత్రి కేటీఆర్‌తోనే సిరిసిల్ల పట్టణం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని బీఆర్ఎస్ పట్టణ యూత్ అధ్యక్షుడు సుంకపాక మనోజ్ అన్నారు.

భాషా సంస్కృతికి పట్టం కట్టిన 'గూడూరి'

- జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి పర్శరాములు


నివాళి అర్పిస్తున్న పర్శరాములు, సభ్యులు

ఎల్లారెడ్డిపేట: తెలంగాణ తొలితరం కథారచయిత గూడూరి సీతారాం భాషాసంస్కృతులను, బతుకులను తన రచనల ద్వారా రికార్డు చేశారని జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి వాసరవేణి పర్శరాములు అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డిపేటలో గూడూరి 87వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి మాట్లాడారు. నిజాం కాలంలో భూస్వాములు, పెత్తందార్ల దౌర్జన్యాలను నిరసిస్తూ తెలంగాణ యాస, భాషలలో ఆయన రచనలు చేశారన్నారు. 1953 నుంచి 1965 వరకు మారాజు, రంగడు, రాజమ్మరాజరికం, మేడిపండు, పెళ్లిప్రేమ, నారిగాని బతుకు వంటి 80కి పైగా కథలు రాశారని గుర్తు చేశారు. సీతారాం రచనల గురించి పదో తరగతిలో పాఠ్యాంశంగా చేర్చారన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ దుంపెన రమేశ్, సభ్యులు అజయ్, దస్తగీర్, మేగి రాజు, నరేశ్ పాల్గొన్నారు.